


నగరంలోని శ్రీరామేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



వేములవాడ ఆలయం వద్ద భక్తుల రద్దీ

శివోహం

- ఘనంగా శివరాత్రి
- శివనామస్మరణలతో మార్మోగిన ఆలయాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 8: జిల్లా వ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయాలను సందర్శించి ఉపవాసాలు పాటిస్తూ దైవదర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. లింగోద్భవకాలం వరకు దీపారాధనలు, జాగరణ చేశారు. బిళ్వదళాలు, గోగుపూలతో మహాశివుడిని అర్చించి తరించారు.

- పాతబజార్ గౌరీశంకరాలయంలో సుప్రభాతసేవ, అభిషేకాలు, సర్వదర్శనం ఏర్పాటు చేశారు. మహాన్యాస పూర్వక అభిషేకాలు, బిళ్వదళార్చనలు, రాత్రి 12 గంటలకు మహాభిషేకం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఈవో వుడుతల వెంకన్న భక్తులకు ఏర్పాట్లు చేశారు. . రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు జరిపారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ఎంపీ, బీజేపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ తదితర నాయకులున్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ యాదగిరి సునీల్‌రావు ఆలయంలో పూజలు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి శివయ్యను దర్శించి పూజలు చేశారు. పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

- కమాన్‌రోడ్ రామేశ్వరాలయం, భగత్‌నగర్ భవానీశంకరాలయం, శ్రీహరినగర్ రామలింగేశ్వరాలయంలో అభిషేకాలంకరణలు, అర్చనలు నిర్వహించారు. ఆదర్శనగర్ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, సాయంత్రం శివకల్యాణం, రాత్రి శివపార్వతుల పల్లకీసేవ నిర్వహించారు. రాంచంద్రాపూర్‌కాలనీ దేవుళ్లపురిలో శివభక్త మార్కండేయ ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, మళయాళ సద్గురు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇల్లందకుంటలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంటలో..

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయ ఆవరణలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణాన్ని శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 10:30కు ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించి కల్యాణ మండపం వరకు శివపార్వతులను తీసుకెళ్లి ఆసీనులను చేశారు. 11:30కు అర్చకులు శివపార్వతుల కల్యాణాన్ని మడికొండ నవీన్‌శర్మ జరిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, ఎంపీటీసీ దంసాని విజయ, మాజీ సర్పంచ్ కంకణాల శ్రీలత సురేందర్‌రెడ్డిపాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈవో సుధాకర్ ఏర్పాట్లు చేశారు.



పాతబజార్ గౌరీశంకర ఆలయంలో అభిషేకం చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



పాతబజార్ శివాలయంలో ఎంపీ బండి సంజయ్ పూజలు



వేములవాడలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్



పాతబజార్ గౌరీశంకరుడికి పూజలు చేస్తున్న భక్తులు



పాతబజార్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గన్నేరువరంలో భక్తుల రద్దీ



గంగాధర మండలం కొట్లనర్సింహులపల్లి వీరభద్ర ఆలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు



కరీంనగర్ రామేశ్వరాలయంలో క్యూకట్టిన భక్తులు



చొప్పదండి శివకేశవ ఆలయంలో..



జమ్మికుంటలో..

కాంగ్రెస్ జిల్లా అభ్యర్థులకు

తొలి జాబితాలో దక్కని చోటు

కరీంనగర్ స్థానానికి ముగ్గురి మధ్య పోటీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాను శుక్రవారం ప్రకటించింది. 36 మందితో కూడిన ఈ జాబితాలో రాష్ట్రానికి చెందిన వారు నలుగురు అభ్యర్థులు మాత్రమే ఉన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలకు ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ తొలిజాబితాను విడుదల చేసి ప్రచారం కూడా ప్రారంభించాయి. అభ్యర్థుల ఎంపిక విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎటూ తేల్చలేదు. బీఆర్ఎస్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను, పెద్దపల్లి నియోజకవర్గానికి కొప్పుల ఈశ్వర్‌ను అభ్యర్థులుగా ప్రకటించింది. బీజేపీ కరీంనగర్ నియోజకవర్గానికి సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేరునే మళ్లీ ఖరారు చేసి పెద్దపల్లి అభ్యర్థిని పెండింగ్‌లో పెట్టింది.

కరీంనగర్ అభ్యర్థి ఎంపికపై మల్లగుల్లాలు

కరీంనగర్ స్థానానికి రాష్ట్రం నుంచి మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఒక్కరి పేరు మాత్రమే ఏఐసీసీకి పంపించినట్లు ప్రచారం జరిగింది. కేంద్ర ఎన్నికల కమిటీ, ఏఐసీసీ స్థాయిలో మాత్రం ప్రవీణ్‌రెడ్డి పేరుతోపాటు రుద్ర సంతోష్‌కుమార్, వెలిచాల రాజేందర్‌రావు పేర్లు పరిశీలనకు వచ్చి ఈనెల 7న జరిగిన సమావేశంలో వారిలో ఒకరిని అభ్యర్థిగా ఎంపిక చేయడానికి సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు ప్రవీణ్‌రెడ్డికి ఉండగా వెలిచాల రాజేందర్‌రావు అభ్యర్థిత్వంపై మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లాకు చెందిన శాసనసభ్యులు సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. రాహుల్‌గాంధీ టీంసభ్యుడిగా, పార్టీ పనుల్లో ఉన్న రుద్ర సంతోష్‌కుమార్ ఏఐసీసీ, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులతో తనకున్న సాన్నిహిత్యంతో అభ్యర్థిత్వం కోసం గట్టిగా పోటీపడుతున్నారని సమాచారం. బీసీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని, ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీసీ అభ్యర్థికి గట్టిపోటీ ఇవ్వాలంటే బీసీగా తానే సరైన అభ్యర్థినని ఆయన పేర్కొంటున్నారని సమాచారం. ముగ్గురి మధ్య నెలకొని ఉన్న పోటీ కారణంగా తొలిజాబితాలో కరీంనగర్ అభ్యర్థిని ఖరారు చేయలేక పోయారని చెబుతున్నారు.



పెద్దపల్లిలో గట్టిపోటీ ఇస్తున్న మాదిగ సామాజిక వర్గం

పెద్దపల్లి లోక్‌సభ స్థానానికి గడ్డం వంశీ, డాక్టర్ సుగుణకుమారి, గజ్జెల కాంతం, పెరుక శ్యాం, ఆసంపల్లి శ్రీనివాస్ పోటీపడుతున్నారని సమాచారం. గడ్డం వివేక్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే తన కుమారుడైన గడ్డం వంశీకి పార్లమెంట్ స్థానంలో పోటీచేసే అవకాశం కల్పించాలని కోరి హామీ పొందినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంశీ అభ్యర్థిత్వంపై సానుకూలంగా ఉన్నట్లు తెలిసింది. రాష్ట్రంలో ఉన్న మూడు ఎస్సీ సీట్లలో ఒక స్థానాన్ని మాల సామాజికవర్గానికి, రెండు స్థానాలు జనాభా అధికంగా ఉన్న మాదిగ సామాజికవర్గానికి ఇవ్వాలని పార్టీ నిర్ణయించుకున్న నేపథ్యంలో ఎవరికి ఎక్కడ అవకాశం కల్పించాలనే విషయంపై చర్చలు జరుగుతున్నటుట్ల తెలిసింది. నాగర్‌కర్నూల్‌లో మల్లు రవికి అవకాశం కల్పించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు సమాచారం. ఆయన మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో పెద్దపల్లి, వరంగల్ స్థానాలను మాదిగ సామాజిక వర్గానికి కేటాయిస్తారని భావిస్తున్నారు. అదే జరిగితే మాల సామాజిక వర్గానికి చెందిన గడ్డం వంశీకి టికెట్ కేటాయించే అవకాశాలు తగ్గుతాయి. సుగుణకుమారి, గజ్జెల కాంతం, పెరుక శ్యాం, ఆసంపల్లి శ్రీనివాస్ నలుగురు మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారే.. మంత్రి శ్రీధర్‌బాబు తెలంగాణ ఉద్యమంలో ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్‌గా కీలక పాత్ర వహించిన గజ్జెల కాంతం అభ్యర్థిత్వంపై సానుకూలంగా ఉండడంతో ఆయన గట్టిపోటీదారుగా మారినట్లు చెబుతున్నారు. సుగుణకుమారి మాజీ ఎంపీగా ఇక్కడ విస్తృత సంబంధాలు కలిగి ఉన్నా ఎన్నికల సమయంలోనే వచ్చి దరఖాస్తు చేసుకున్నారని, పార్టీలో కూడా లేరని ప్రత్యర్థి అభ్యర్థులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నియోజకవర్గంలో సుమారు రెండు లక్షల పైచిలుకు మాదిగ సామాజికవర్గం ఓట్లు ఉండడం, ఇప్పటి వరకు మాల సామాజికవర్గానికే ప్రాధాన్యం లభిస్తున్న నేపథ్యంలో ఈసారి మాదిగలకే అవకాశం కల్పించాలని ఆ వర్గం డిమాండ్ చేస్తున్నది. జేఏసీ నేతగా విస్తృత సంబంధాలున్న గజ్జెల కాంతంకు తన సామాజికవర్గం, అన్ని పక్షాల నేతల నుంచి కూడా మద్దతు లభించే అవకాశం ఉండడం, శ్రీధర్‌బాబు ఆశీస్సులు కూడా తోడుకావడంతో అధిష్ఠానం ఆయన పేరును ప్రధాన పరిశీలనలోకి తీసుకునే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సుగుణకుమారి, పెరుక శ్యాం, ఆసంపల్లి శ్రీనివాస్ కూడా ఢిల్లీ స్థాయిలో తమకున్న పరిచయాలతో ప్రయత్నాలు ముమ్మరంచేసినట్లు తెలిసింది. ఈనేపథ్యంలోనే ఈ స్థానంపై కూడా చర్చ ఒక కొలిక్కి రాక అభ్యర్థిత్వ ఖరారు వాయిదాపడ్డట్లు చెబుతున్నారు. రెండో జాబితాలో జిల్లాలోని రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని సమాచారం.

రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద షెడ్ వేయిస్తా..

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ కల్చరల్, మార్చి 8: కరీంనగర్‌లోని బైపాస్‌రోడ్ సమీపంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం 10 లక్షల నిధులు మంజూరు చేసి షెడ్ వేయిస్తానని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. శివరాత్రి సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ డంప్‌యార్డ్‌ను ఎత్తివేయాలని, షెడ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందించింది. సానుకూలంగా స్పందించిన ఎంపీ బండి సంజయ్ డంప్‌యార్డును త్వరలోనే తరలించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆలయ ప్రాంగణంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరో 30 లక్షలు కేటాయిస్తానని ప్రకటించారు.

డెంగ్యూతో ఒకరి మృతి



రాములు(ఫైల్)

కోనరావుపేట, మార్చి 8: రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారంగ్రామానికి చెందిన పిట్టల రాములు (55) అనే వ్యక్తి డెంగ్యూతో శుక్రవారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన పిట్టల రాములు రెండురోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు అసుపత్రిలో చూపించగా రక్తకణాలు తగ్గాయని, డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని హైదారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాలని కుటుంబసభ్యులకు సూచించా రు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుకు, కూతురు రమ్య, కుమారులు శ్రీకాంత్, ప్రశాత్‌లుఉన్నారు.

కుక్కల దాడిలో మేకల మృతి

కోనరావుపేట, మార్చి 8: కోనరావుపేట మండలం కొండాపూర్‌లో కుక్కలు దాడి చేసి గొర్రె, మేక పిల్లలను చంపివేశాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన బెదిరే రాములుకు చెందిన మేక, గొర్రె పిల్లలను ఇంటి వద్దనే కంచే వేసి అందులో ఉంచి మేక, గొర్రెలను మేత కోసం తీసుకవెళ్లాడు. శుక్రవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి నాలుగు గొర్రెలు, 5 మేక పిల్లలను కుక్కలు దాడి చేసి చంపివేశాయి. కుక్కల దాడిలో మృతిచెందిన మేకలను చూసి భోరున విలపిస్తూ రూ లక్ష వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అదుకోవాలని వేడుకుంటున్నారు.

అడవి నుంచి జనంలోకి వచ్చిన దుప్పి



దుప్పిని కాపాడిన గ్రామస్థులు

కోనరావుపేట, మార్చి 8: ఓ చుక్కల దుప్పి దాహార్తిని తీర్చుకోవడం కోసం అడవి నుంచి గ్రామ శివారులోకి వచ్చింది. దుప్పిని చూసిన కుక్కలు వెంట పడి తరమగా కోనరావుపేట గ్రామంలోకి చేరింది. వెంటనే గమనించిన గ్రామస్థులు దుప్పిని పట్టుకోని కుక్కల ను చెదరగొట్టి దాని దాహార్తిని తీర్చి అటవీ ప్రాంతంలో వదిలివేశారు.

రేపు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్, మార్చి 8: ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలను ఆదివారం ఉదయం 8 గంటలకు గోదావరిఖని సింగరేణి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ డబ్ల్యూ గణపతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తికల క్రీడాకారులు పాల్గొనా లన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

బావిలో పడి ఒకరి మృతి

కొడిమ్యాల, మార్చి 8: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన సిరిమల్ల దేవయ్య(58)అనే వ్యక్తి మతిస్థిమితం లేక మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామ శివారులో గల బావి పక్కన వేప పుల్లను తెంపటానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివ రాల మేరకు దేవయ్యకు కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేని కారణంగా ఈ నెల 7న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈత రాని కారణంగా కాలు జారి బావిలో పడి మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుని భార్య సిరిమల్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ప్రతినిధులు


ఏర్పాట్లను తెలుసుకుంటున్న కలెక్టర్


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

శంభోశంకర

- శివనామ స్మరణతో మార్మోగిన రాజన్న క్షేత్రం

- వేములవాడలో కన్నుల పండువగా మహాశివరాత్రి వేడుకలు

- స్వామివారికి మహాలింగార్చన, మహా న్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

వేములవాడ, మార్చి 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆపదమొక్కుల దేవుడు రాజరాజేశ్వరస్వామివారి పుణ్యక్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం రోజున భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని తరించారు. ఉదయం నుంచి ఉపవాసం పాటించి రాత్రంతా జాగరణ చేశారు. రాజన్న క్షేత్రంలో అత్యంత ప్రధానమైన మహాశివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని రాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కును చెల్లించుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు రాజరాజేశ్వరస్వామి వారికి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి పప్పు బెల్లాలు పంచిపెట్టారు. రద్దీ అధికంగా ఉండడంతో స్వామి వారి దర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.

● ఘనంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి 11-35 గంటలకు లింగోద్భవ సమయంలో ఋత్విజులు, వేదపండితులు, అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సాయంత్రం 6-05 గంటల నుంచి స్వామివారి కల్యాణమండపంలో మహాలింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న సమయంలో రాజరాజేశ్వర స్వామివారిని లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తరించగా, వేలాది మంది భక్తులు జాగరణ పాటించారు. ఆలయ పరిసరాలు, గుడిచెరువు ప్రాంగణంలోని బహిరంగప్రదేశంలో రోజంతా ఉపవాసం ఉండి మట్టితో శివలింగాలు, ప్రమిదలు రూపొందించి దీపాలు వెలిగించారు. నైవేద్యం సమర్పించి, రాత్రంతా మెలకువతో ఉండి స్వామివారిని కొలిచి తరించారు.



భక్తులు స్వామివారికి నిలువెత్తు బంగారం (బెల్లం) పంచిపెట్టారు. స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆలయ పరిసరాలు కలియతిరుగుతూ ఉత్సవాల ఏర్పాట్లపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి నేతృత్వంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, భీమ్యానాయక్, ఆర్డీవో ఎస్ రాజేశ్వర్, ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్, తహసీల్దార్ మహేశ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

● శృంగేరి శారదాపీఠం తరపున పట్టువస్త్రాల సమర్పణ..

మహాశివరాత్రి సందర్భంగా రాజరాజేశ్వరస్వామి వారికి శృంగేరి శారదా పీఠం తరపున పట్టు వస్త్రాలు అందజేశారు. శృంగేరి ఆస్థాన పండితులు వ్యాసోజుల రాధాకృష్ణశర్మ పట్టు వస్త్రాలు తీసుకురాగా, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి అందజేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాధాకృష్ణశర్మకు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.


భక్తులతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్


యాత్రికుల వాహనాలు


దర్శనం కోసం వెళ్తున్న శివస్వాములు


ధర్మగుండంలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు


వేములవాడలో భక్తుల సందడి


చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు


భక్తులకు పండ్లు అందజేస్తున్న వలంటీర్లు


తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

హోరాహోరీగా ఎడ్లబండ్ల పోటీలు

● భారీ ఎత్తున తరలివచ్చిన ప్రజలు

● విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

జగిత్యాల, మార్చి8: జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం రాపల్లె శ్రీరాజరాజేశ్వర స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి జాతర సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు హోరాహోరీగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పది ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను తిలకించేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. పోటీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన కొట్లపెల్లి సాగర్ ప్రథమ విజేతగా నిలిచి దాతరాపల్లె గ్రామానికి చెందిన కొక్కుల పద్మ-జలేందర్ దంపతులు అందించిన పావు తులం బంగారంను కైవసం చేసుకున్నారు. మండలంలోని తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషమియా రెండో విజేతగా నిలిచి రాపల్లె గ్రామానికి చెందిన దాత ఎక్కల్‌దేవి పద్మ-మల్లయ్య యాదవ్ అందించిన 10 తులాల వెండిని గెలుచుకోగా, మూడో విజేతగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాడి కిట్టు నిలవగా దాత ఎడ్ల మల్లారెడ్డి అందించిన 5 తులాల వెండిని గెలుచు కున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతర సందర్భంగా ప్రజలకు ఉత్సాహం, ఉల్లాసం కలిగించేందుకు పోటీలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు నల్ల శ్యామ్, మారంపల్లి బాబు, కొక్కుల భూమయ్య, గంధ్ర సత్యంరావు, ఆలయ కమిటీ చైర్మన్ గంధ్ర రామారావు, వైస్ చైర్మన్ సత్తయ్య, మల్లేశం, నాయకులు మారంపల్లి మల్లయ్య, కోలా శ్రీనివాస్, కొక్కుల శ్రీనివాస్, గంగాధర్, శేఖర్, కోలా రాములు, తదితరులు పాల్గొన్నారు.


రాపల్లెలో ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వీణవంక తహసీల్దార్ సస్పెన్షన్

వీణవంక, మార్చి 8: వీణవంక మండలంలో తహసీల్దార్‌గా పని చేస్తున్న తిరుమల్‌రావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన రామిడి శివప్రియ అమెరికాలో ఉంటారు. ఆమె పేరుపై ఉన్న 16 గుంటల భూమిని ధరణి ఆపరేటర్ అరుణ్ ముగ్గురు వ్యక్తుల పేరుపై అక్రమంగా పట్టా చేశాడు. ఆ సమయంలో తహసీల్దార్ తిరుమల్‌రావు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ధరణి ఆపరేటర్ అరుణ్ తహసీల్దార్ డిజిటల్ కీని ఉపయోగించి ఈ అక్రమ పట్టా చేశాడు. ఈ విషయం తెలుసుకున్న తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆమె విచారణ జరిపించి విదేశాల్లో ఉన్న మహిళకు సంబంధించి భూమిని ఇతరులకు పట్టా చేసేటప్పుడు కనీస నిబంధనలు పాటించలేదని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు తహసీల్దార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

నేటి నుంచి మెడికల్ రిప్రజంటేటివ్స్ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 8: తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రాజుభట్ తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం అన్ని రకాల మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ తొలగించాలని, ఆన్‌లైన్‌లో మందుల అమ్మకాలను నిషేదించాలని, అన్నారు. ప్రభుత్వం ఫార్మ, వ్యాక్సిన్ సంస్థలను పునరుద్ధరించాలని, ఫార్మ రంగంలో అనైతిక కార్యక్రమాలను అరికట్టాలని, యూసీపీఎంపీ కోడ్‌ను అమలు చేయాలని వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మెడికల్ అండ్ సేల్స్ రిప్రజంటేటివ్స్ కోసం ఏర్పాటు చేయబడిన సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ని పరిరక్షించాలని, అన్ని ఫార్మా కంపెనీలు ఫారం ఏ లో అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తమకు పని విధానాలను రూపొందించాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, కార్యదర్శి వెంకటేశ్, జాతీయ సహాయ ప్రధాన కార్యదర్శి కె సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ భానుకిరణ్, ఉపాధ్యక్షుడు జి విద్యాసాగర్, సహాయ ప్రధాన కార్యదర్శి, జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎ నాగేశ్వర్‌రావు, కోశాధికారి దుర్గాప్రసాద్, కార్యదర్శులు కె ఐల య్య, సిహెచ్ శ్రీధర్, ఎ సదానందచారి, సయ్యద్ సిద్దిఖీ, ముకుంద్‌కులకర్ణి, పి ము రళి, పీవీఎస్‌వి ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుండా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, అంజయ్య, ఉపాధ్యక్షుడు పి నరేందర్, శ్రవణ్ కుమార్, సహాయ కార్యదర్శులు కె సంపత్‌రెడ్డి, కె రమేశ్, కోశాధికారి కె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ పోరాటం అంతిమ దశకు చేరుకుంది

- మన లక్ష్యానికి అండగా ఉన్నవారికే మద్దతు - ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

సుభాష్‌నగర్, మార్చి 8: ఎస్సీ వర్గీకరణకు 29 సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటం అంతిమ దశకు చేరుకుందని, తమ లక్ష్యాలకు అండగా ఉన్నవారికే మద్దతుగా ఉండాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో శుక్రవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కరీంనగర్ పార్లమెంట్ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందన్నారు. బీజేపీ మినహా దేశంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను మోసం చేశాయని చెప్పారు. 2004లో వర్గీకరణ విషయాన్ని కొట్టివేయడంలో కాంగ్రెస్ పార్టీతో పాటు కొంత మంది కుట్రలు చేశారని ఆరోపిం చారు. ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ముందడుగు వేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే పార్టీలకు మనం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌తోపాటు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎం ఈఎఫ్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఇంజం వెంకటస్వామి, తుంగ ఆంజనేయులు, దండు అంజ య్య, కనకం అంజిబాబు, ఎలగందుల భిక్షపతి, రుద్రరాపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

మల్యాల, మార్చి 8: కొండగట్టు ఆంజనేయస్వామిని శుక్రవారం సిరిసిల్ల జిల్లా వేములవాడ సబ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి రవీందర్, బాహుబలి సినిమా డైరెక్టర్ రాజమౌళి తండ్రి, సినీ రచయిత విజయేంద్రప్రసాద్ వేర్వేరు గా దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన అనం తరం ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా సత్కరించారు. ఏఎస్సై చిలుక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు

రేపు రాష్ట్ర బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 8: జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ జూనియర్స్ బేస్ బాల్ జట్ల రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, మహ్మద్ యూనిస్ పాషా తెలిపారు. బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న ఈ ఎంపిక పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 330 మంది క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను పంజాబ్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

తాట్లవాయిలో యువకుడి దారుణ హత్య

- దుండగులు బలమైన ఆయుధంతో చంపి.. బావిలో పడేసినట్లు అనుమానం

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మండలంలోని తాట్లవాయిలో శుక్రవారం దారుణం జరిగింది. గ్రామానికి చెందిన నాగెల్లి సురేష్(24) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు బలమైన ఆయుధంతో దారుణంగా హతమార్చి వ్యవసాయ బావిలో పడేసి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం పొలానికి వెళ్తున్నానంటూ ఇంట్లోంచి బయటకు వెళ్లిన సురేష్ శుక్రవారం బావిలో శవమయ్యాడని కుటుంబీకులు రోదిస్తూ తెలిపారు. ఇంట్లోంచి పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన సురేష్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు శుక్రవారం పొలం వద్ద వెతికారు. బావి సమీపంలో మృతుని ద్విచక్ర వాహనం, చెప్పులు లభించాయి. దీంతో కంగారుపడిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చి బావి చుట్టూ గాలించగా బావి వద్ద రక్తపు మరకలు కనబడటంతో బావిలో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తొలగించగా మృతదేహం లభించింది. గుర్తు తెలియని దుండగులు సురేష్‌ను బలమైన ఆయుధంతో తలపై దాడి చేసి చంపి అతని వ్యవసాయ బావిలోనే పడవేసి ఉంటారని భావిస్తున్నారు. మృతుని తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం కాగా, సురేష్ చిన్నవాడు. బావిలో నుంచి శవాన్ని బయటకు తీయగా మృతుని శరీరంపై చాలా చోట్ల గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి పంపి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు. కాగా పూర్తి స్థాయి విచారణ జరిపి హత్య వివరాలు వెలికితీయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సంఘటనా స్థలం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. సంఘటనా స్థలాన్ని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, సీఐ ఆరిఫ్ అలీ ఖాన్, ఎస్సై అజయ్‌లు సందర్శించారు. హత్య వ్యవహారంపై క్షేత్ర స్థాయిలో విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.


సురేష్(ఫైల్)


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

పోలీసు కస్టడీకి నందెల్లి మహిపాల్

కరీంనగర్ క్రైం, మార్చి 8: భూకబ్జాకు సంబంధించిన కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్‌ను శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. మహిపాల్‌పై నమోదైన కేసులో మరింత లోతుగా విచారణ జరిపేందుకు అనుమతివ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ వేయగా 24 గంటల పోలీసు కస్టడీకి అనుమతించింది. దీంతో ఉదయం 11 గంటలకు మహిపాల్‌ను కస్టడీకి తీసుకుని కరీంనగర్ రూరల్ ఠాణాకు తరలించి విచారణ జరుపుతున్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి8: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని జీనియస్ చదరంగ అకాడమీలో ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగ పోటీలను నిర్వహించనున్నామని జీనియస్ చదరంగ అకాడమీ కోచ్ కంకటి అనిల్‌కుమార్ తెలిపారు. ముగ్గురు విజేతలకు రూ.5వేల చొప్పున నగదు బహుమతి, పది మందికి ప్రత్యేక బహుమతులు ఉంటాయని తెలిపారు.

'రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్‌పై ఆరోపణలు'



మాట్లాడుతున్న నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మార్చి 8: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ప్రజలను తప్పుదోవపట్టిస్తే ఊరుకోబోమని ఆయన అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రైతు సెల్‌ఫోన్‌లో రాత్రి మాత్రమే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ అధికారులు మెస్సేజ్ పెట్టారని చెప్పిన ఎమ్మెల్యే కేటీఆర్ దానిని చూపించలేకపోయారని విమర్శించారు. ఇప్పటికైనా డ్రామాలు మానుకోవాలని అన్నారు. ఇరుకుల్ల గ్రామ రైతులు గత ఏడాది అకాల వర్షాలకు పంట నష్టపోతే పరిహారం ప్రకటించి ఒక్కరూపాయి ఇవ్వకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం సిగ్గుచేటన్నారు. రైతులకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా ఇస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టంగా చెబుతున్నారని అన్నారు. ప్రతి సంవత్సరంలాగా వేసవి కాలంలో కొంతమేర నీటి ఎద్దడి ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు బాధ్యతా రహితంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో నీటి ఎద్దడి వచ్చిందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అఖిల్, షేక్ షహెన్‌షా, భారీ, కీర్తికుమార్, సత్యనారాయణ రెడ్డి, అష్రాఫ్, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎలివేటెడ్ కారిడార్ పారిశ్రామిక అభివృద్ధికి దోహదం

కరీంనగర్ టౌన్, మార్చి 8: హైదరాబాద్ నుంచి రామగుండంకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్, ఆరు లైన్ల రోడ్ కరీంనగర్ జిల్లాకు రవాణా పరంగానే కాకుండా పారిశ్రామికాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని రాష్ట్ర ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా చాంబరాఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్, జిల్లాకార్యదర్శి పెద్ది లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్ నుంచి రామగుండం వరకు ఎలివేటెడ్ కారిడార్, ఆరులైన్ల రోడ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందించారు. ఈకారిడార్‌తో కరీంనగర్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వారికి సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఈకార్యక్ర మంలో జిల్లాప్రముఖ వ్యాపారవేత్తలు ఆవునూరి వరప్రసాద్, ఆవునూరి శ్రీనివాస్, శివనాత్రి రవీందర్, వొమ రవీందర్, దొమ్మాటి రాజేందర్, గంగిశెట్టి రమేశ్, కాసనగొట్టు సుధాకర్, అలుగూరి శ్రీనివాస్, కొండూరి రాంప్రసాద్, గాధ కృష్ణ మూర్తి, కోటగిరి కిషన్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మార్చి 8: నగరంలోని సాయినగర్ విజయగణపతి సాయిబాబా దేవాలయంలో ఈనెల 16న ఉదయం 11 గంటలకు కొబ్బరి ముక్కల ప్రోగు, ఫొటోలు, భక్తి క్యాసెట్లు, టెంకాయలు, పూలదండలు 2025 మార్చి 31వ తేదీ వరకు అమ్ముకునే హక్కుల కోసం టెండర్ల నిర్వహణకు దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ ద్వారా ఉత్తర్వులు పొందినట్లు ఈఓ ఎండపెల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ వరకు టెండరు ఫారములు తీసుకోవాలని, ఔత్సాహికులు మిగతా వివరాలకు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి శ్రీభాష్యం విజయసారథి జయంత్యుత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి8: పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి జయంత్యుత్సవాలు శని, ఆది వారాల్లో జరగనున్నాయి. ప్రతీ యేటా సంస్కృత పండితుడికి 25 వేల నగదు, ప్రశంసాపత్రం ప్రదానం చేస్తున్నారు. ఈయేడు 2024 పురస్కారాన్ని తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుల్లపల్లి శ్రీరామ కృష్ణమూర్తికి ప్రదానం చేయనున్నారు.

●శనివారం ఉదయం వేదపారాయణం, సాయంత్రం 6 గంటలకు టీటీడీ కళాకారిణి జయంతి సావిత్రి భాగవతారిణి హరికథ ఉంటుంది. శ్రీభాష్యం జయంతి అయిన ఆదివారం ఉదయం 10 గంటలకు రాష్ట్రీయ సంస్కృత పురస్కార ప్రదానం చేస్తారు. విజయసారథి జయంత్యుత్సవాలను ఆలయ సభ్యులు, భక్తులు, శిష్యులు అందరూ కలసి విజయవంతం చేయాలని ఎస్‌వీఎస్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ అన్నారు.

మూడు ఉద్యోగాలకు ఎంపికైన యువతి

కరీంనగర్ టౌన్, మార్చి 8: నగరంలోని మంకమ్మతోటకు చెందిన ఆయేషా ఫాతిమా ఇటీవల తెలంగాణ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు వరుసగా బీసీ వెల్ఫేర్ సొసైటీ, మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ, సోషల్ వెల్ఫేర్ సొసైటీలలో ఉద్యోగాలు సాధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

ఈజీఎస్ నిధులతో గ్రామాలు అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

ఇల్లందకుంట, మార్చి 8: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధులతో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కనగర్తి, లక్ష్మాజీపల్లి, మల్యాల, వాగొడ్డురామన్నపల్లె గ్రామాల్లోని ఈజీఎస్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్‌రావు, మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, శ్రీనివాస్, రమేశ్, సాంబయ్య, ఎల్లారెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్, విజయ్‌బాబు, గోపాల్, పవన్‌రెడ్డి, శ్రీధర్, అజయ్, వినయ్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలు పట్టని బీఆర్ఎస్ నాయకులు'

చిగురుమామిడి, మార్చి 8: బీఆర్ఎస్ నాయకులకు ప్రజా సమస్యలపై పట్టింపు కరువైందని జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ అన్నారు. చిగురుమామిడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యల పట్ల మాట్లాడకుండానే 45 నిమిషాలలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు వాకౌట్ చేయడంపై మతలబు ఏంటో జిల్లా ప్రజలకు జవాబు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జడ్పీటీసీల పనితీరును జిల్లా ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే కాలంలో వారికి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, డిసిసి అధికార ప్రతినిది దాసరి ప్రవీణ్‌కుమార్‌నేత, బిసి సెల్ మండల అధ్యక్షులు పొన్నం సంపత్, నాయకులు చీల లక్ష్మారెడ్డి, ఆనంద్, మల్లారెడ్డి, కవ్వంపల్లి సంజీవ్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గం

జమ్మికుంట రూరల్, మార్చి 8: జమ్మికుంట మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల ప్రెసిడెంట్‌గా కుర్రి ఏలియా, వైస్ ప్రెసిడెంట్‌గా మైస స్వామిదాస్, జనరల్ సెక్రటరీగా ఎస్ఎల్ ఆనంద్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎల్ టైటస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్ నెహెమ్యా, ట్రెజరర్ గా సామ్యేల్, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్ఎల్ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, మార్చి 8: ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అన్నారం గ్రామంలో కరీంనగర్‌లోని వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా రంగంపై దృష్టి సారించాలని చెప్పారు. కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నమల్ల చైతన్య, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం







కరీంనగర్‌లో కేక్ కట్ చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, రెనే ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి అరుణ, 31వ డివిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళలు

కరీంనగర్ క్రైం, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా జైలులో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మిలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలందరూ పురుషులతో పోటీ పడుతూ అన్నిరంగాలలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సరస్వతి కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి సమ్మయ్య, జైలర్ బి రమేష్, డిప్యూటీ జైలర్ కె శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

●**కరీంనగర్ టౌన్:** ఒకేసారి పలు ఉద్యోగాలకు ఎంపికైన పుప్పాల మమతను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి అభినందించారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో ఐదు ఉద్యోగాలు సాధించిన మమతను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. మహిళలు ఒకవైపు కుటుంబం మరోవైపు ఉద్యోగ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా మహిళలు రాణించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తెలంగాణ యువజన సమితి జిల్లా అధ్యక్షుడు సత్తినేని శ్రీనివాస్, కార్యదర్శి జక్కని సాయిరాం, ఉపాధ్యక్షుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ కల్చరల్:** నగరంలోని 31వ డివిజన్, లక్ష్మీనగర్‌లోని పార్వతీనగర్‌లో పార్వతీనగర్ కమ్యూనిటీ కమిటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఆత్మగౌరవంతో హక్కుల కోసం పోరాడుతూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీనగర్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిలుక ధర్మయ్య, తంగళ్ల విష్ణు, కోశాధికారి జి రవీందర్, కార్యదర్శి జి రాజు, ఆంజనేయులు, రామన్న, శంకర్, రాజు, రఘు, చారి, శిరీష, శశికళ, సభ్యులు పాల్గొన్నారు.

రెనే ఆసుపత్రిలో..

●**సుభాష్‌నగర్:** ప్రతి మహిళ చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మేకల అరుణ అన్నారు. శుక్రవారం నగరంలోని రెనే ఆసుపత్రిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేటి సమాజంలో వివాహ వ్యవస్థ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. యుక్తవయస్సులో ఆకర్షణలకు గురి కాకుండా సరైన జీవన మార్గాన్ని అనుసరించడం ఎంతో అవసరమని అన్నారు. చట్టాలను గౌరవించాలని సూచించారు. నేడు వివాహం జరిగిన అతి తక్కువ సమయంలోనే ఎన్నో జంటలు విడాకులు తీసుకుంటున్నాయని, ఇది సరైన జీవన విధానం కాదన్నారు. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు.

రెనే ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ వైద్య రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమన్నారు. రోగులకు సేవలందించే విషయంలో నర్సింగ్ సిబ్బంది చేసే సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. తమ ఆసుపత్రిలో పూర్తిస్థాయి స్నేహపూరిత వాతావరణంతో కూడుకుని ఉంటుందని, స్త్రీలకు ప్రత్యేక గౌరవం ఇస్తున్నామన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీప్రియదర్శిని మాట్లాడుతూ ప్రతి మహిళ తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. స్త్రీ లేనిదే సమాజంలో పరిపూర్ణత లేదన్నారు. ఈ సందర్భంగా న్యూరో ఫిజీషియన్ డాక్టర్ పారుపెల్లి హరిత, డాక్టర్ జె రజిత, డాక్టర్ రజనీప్రియదర్శినిలతోపాటు ఆసుపత్రిలోని ప్రతి విభాగంలోని మహిళ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రాచారి, డాక్టర్ నిఖిల్‌లక్ష్మన్, కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి జనరల్ మేనేజర్ అరవింద్‌రావు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

●సుభాష్‌నగర్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు మహిళలను ఈసందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, కార్యవర్గ సభ్యుడు కోల అన్నారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** హుజూరాబాద్ పట్టణంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మహిళలను సన్మానించారు. అలాగే సీఎస్ఐ చర్చిలో మహిళల గురించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

●**జమ్మికుంట:** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో గల బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నప్పటికీ ఇంకా వివక్షకు గురి అవుతూనే ఉన్నారని తెలిపారు. మహిళలు మరింత శక్తి వంచన లేకుండా కృషి చేసి దానిని రూపుమాపాల్సిన అవసరం ఉందన్నారు. పాలకులు, ప్రభుత్వాలు, కార్మికుల చట్టాలను సవరించి పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు సుమలత, స్వాతి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేష్‌నగర్, మార్చి 8: నగరంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంబేద్కర్‌నగర్, సుభాష్‌నగర్, తీగలగుట్టపల్లి, కిసాన్‌నగర్, మంచిర్యాల క్రాస్ రోడ్, గాంధీ రోడ్, కాపువాడ, వెంకటసాయి, కమాన్, హౌసింగ్‌బోర్డు, రెడ్డి ఫంక్షన్‌హాల్ వెనక భాగం, సాయిరాంనగర్ రోడ్ నం.2 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈసందర్భంగా ఏడీఈ కోరారు.

యజ్ఞవరాహక్షేత్రంలో ముగిసిన అధ్యయనోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 8: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో శుక్రవారంతో అధ్యయనోత్సవాలు ముగిసాయి. శ్రీవైష్ణవ ద్విజులు ఉదయం తిరువాయిమొజి ప్రబంధ పారాయణాన్ని ముగించారు. సాయంత్రం నమ్మాళ్వార్ మోక్షోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్‌శర్మ, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ప్లేట్లు పంపిణీ

సుభాష్‌నగర్, మార్చి 8: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ప్లేట్ల పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అవసర మైన స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ సభ్యుడు శీలం తిరుపతిరెడ్డి ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి గోగోరి శ్రీధర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నయన్ తదితరులు పాల్గొన్నారు.

'కరీంనగర్‌లో బీజేపీదే విజయం'



డిజిటల్ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎంపీ బండి సంజయ్

భగత్‌నగర్, మార్చి7: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్ స్థానం నుంచి బీజేపీ విజయం ఖాయమని పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రచార రథాలను శుక్రవారం నగరంలోని మహా శక్తి దేవాలయ ప్రాంతంలో ఆయన ప్రారంభించారు. ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజలందరికీ తెలియ జేయాలనే ఉద్దేశ్యంతో డిజిటల్ వ్యాన్లను పార్టీ ఏర్పాటు చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం పనితీరు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడానికి డిజిటల్ వ్యాన్‌లు తగిన ప్రచారం నిర్వహిస్తాయన్నారు. దేశ ప్రజలంతా మోదీ ప్రభుత్వంపై విశ్వాసంతో ఉన్నారన్నారు. ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ పక్కా అని గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మాత్రం మోదీ ఉండాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ప్రజాహిత యాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందని, ప్రజలంతా బీజేపీకి ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నా రన్నారు. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో మరో మారు కాషాయ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, కార్పొరేటర్ బండసుమరమణారెడ్డి, దండు కొమురయ్య, విజయ్, బల్వీర్‌సింగ్, గజేరమేష్, ఎన్నం ప్రకాష్, లడ్డు ముందాడ తదితరులు పాల్గొన్నారు.

'లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదు'

సుభాష్‌నగర్, మార్చి 8: పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటుకూడా బీఆర్ఎస్‌కు రాదని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి దూడ కనకయ్య అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ కరువైందన్నారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు అక్రమ భూములకు సంబంధించిన కేసుల్లో కటకటాల పాలవుతున్నారన్నారు. తప్పు చేయనపుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు చేసి గెలిపించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉందన్నారు. జక్కుల రవికుమార్, తాటిపెల్లి శంకర్, సిరిసిల్ల శ్రీనివాస్, జక్కుల చంద్రయ్య, సిరిసిల్ల నర్సయ్య, సిరిసిల్ల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం అమలు

కరీంనగర్ రూరల్, మార్చి7: కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్ల గ్రామంలో గృహజ్యోతి పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లింగ్ రసీదులను కాంగ్రెస్ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కాశిపాక రాకేష్, సీనియర్ నాయకుడు కాశిపాక రమేష్, బుర్ర బాబుగౌడ్, కాశిపాక భాస్కర్, కాశిపాక హన్మంతు, బుర్ర పవన్, ఎగుర్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: పట్టణానికి చెందిన మాడ్గుల ప్రవీణ్ ఇటీవల మృతి చెందగా, మాదిగ మేధావుల ఫోరం సభ్యులు బాధిత కుటుంబానికి రూ. 11,500 అందజేశారు. కార్యక్రమంలో రత్నం, సురేందర్, సుమన్, ప్రకాష్, శేఖర్, వెంకటరాజం, కుమార్, అయిలయ్య, తిరుపతి, రాజలింగం, విజయ్‌కుమార్, శివ, రామాంజనేయులు, మల్లేష్, శ్రీధర్, రాజకుమార్, సాగర్ పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండలంలోని మాధాపూర్‌కు చెందిన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్య క్షుడు కొమ్మెర రవిందర్ రెడ్డి తన కొమ్మెర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను శుక్రవారం గుండ్లపల్లి స్టేజి వద్ద ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారం భించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, బీసీసెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, నా యకుడు బేతెల్లి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: రాజాపల్లికి చెందిన శనిగరపు వైష్ణవి సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 25న మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్ కీపర్‌గా రాణించినందుకు ఈ నెల 13 నుంచి 23 వరకు పూణేలో నిర్వహించనున్న సీనియర్ ఉమెన్ నేషనల్ చాంపియన్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

- మండలంలోని శాలపల్లి-ఇం దిరానగర్ గ్రామంలో గంగిరెద్దుల కమిటీ భవనం పనులకు మాజీ సర్పంచ్ కోడిగూటి శారద ప్రవీణ్ భూమి పూజ చేశారు. గంగిరెద్దుల కులస్థులు మాజీ సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

- మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన పంజాల రేవంత్‌ను బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ శుక్రవారం నియామక ఉత్తర్వు లు అందజేశారు.

● సైదాపూర్: మండలంలో శనివారం 33/11 కేవి సబ్‌స్టేషన్ మరమ్మత్తు ఉన్నందున సైదాపూర్, ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ అంజనే యులుగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● శంకరపట్నం: తాడికల్, కన్నాపూర్ గ్రామాల సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌లో అంతరాయం కలుగనుందని తాడికల్ ఏఈ సంపత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలనుంచి 11గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

- మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కొత్తగట్టు శ్రీ మత్స్యగిరీంద్రస్వామి ఆలయ ఆవరణలో అగ్ని గుండాలు ఏర్పాటు చేశారు. భక్తులు నిప్పులపై నడిచారు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలో హుజూరాబాద్ నియోజకవర్గ స్థాయి తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ముఖ్యతిథులుగా జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఊకంటి మల్లాచారి, ఎక్కటి సంజీవరెడ్డి హాజరయ్యారు.

- తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను హైదరాబాద్‌లో శుక్రవారం జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

మారుమోగిన శివనామ స్మరణ



జమ్మికుంటలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

హుజూరాబాద్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని డివిజన్‌లోని శివాలయాలు శివనామస్మరణతో శుక్రవారం మార్మోగాయి. హుజూరాబాద్ పట్టణంలోని కిందివాడ, ప్రతాపవాడ, బోర్నపల్లి శివాలయాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హుజూరాబాద్‌రూరల్: మండల వ్యాప్తంగా శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెల్పూర్ గ్రామంలోని శివాలయంలో శివ కల్యాణం అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి పట్టణంలోని స్వయంభూ బ్రహ్మసూత్రం శివాలయంలో ఆలయ పూజారులు వసాలమర్రి నాగరాజు శర్మ, వినీత్‌శర్మ, సురేష్‌శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు దంపతులు రుద్రాభిషకం నిర్వహించారు. భక్తులకు కాంగ్రెస్‌నాయకులు మేనేని రోహిత్‌రావు మజ్జిగ ప్యాకెట్లను అందించారు. దుర్శేడ్‌లోని మరకత లింగరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకం, పాశుపత రుద్రాభి షేకం, శివకళ్యాణం, స్ఫటికలింగాలతో మహాలింగార్చన, భస్మహారతి, మహాలింగోద్భవ పూజ, బిల్వదళ సమర్పణ పూజ కార్యక్రమాలు అంగరంగ వైభవంగానిర్వహించారు. నగునూరులోని పరివార సమేత దుర్గా భవానీ ఆలయంలో శుక్రవారం సుందరేశ్వరస్వామికి ఫలరస పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, లింగోద్భవ కాల పూజలు చేశారు.

జమ్మికుంట: పట్టణంలోని శివాలయం (బొమ్మలగుడి), ఆబాది జమ్మికుంటలోని మహాదేవలింగేశ్వరస్వామి ఆలయం, గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివ నామస్మర ణతో మారు మోగాయి. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సైదాపూర్: ఎక్లాస్‌పూర్, గుజ్జులపల్లి, బొమ్మకల్ గ్రామాల్లోని శివాలయాలను మం త్రి పొన్నం ప్రభాకర్ సందర్శించి శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, యూత్ నాయకుడు రాజ్‌కుమార్ పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వీణవంక: మండల వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల పలు చోట్ల పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్ శివాలయంల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

శంకరపట్నం: కేశవపట్నం, చింతలపల్లి, కన్నాపూర్, తాడికల్, కొత్తగట్టు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

ఇల్లందకుంట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు.

మానకొండూర్: మండల వ్యాప్తంగా శుక్రవారం శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈదులగట్టెపల్లి, గంగిపల్లి గ్రామాలలోని ఆలయాల్లో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, ఆలయ కమిటి నిర్వాహకులు మీస సత్యనారాయణ, రెడ్డి సంపత్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

చొప్పదండి: శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శివాల యంలో భక్తులు వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. చొప్ప దండి లోని ప్రాచీనమైన శివకేశవ ఆలయంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు.

చిగురుమామిడి: మండల వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎం పీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గీకురు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: గోపాల్‌రావుపేట, రామడుగు, దేశరాజ్‌పల్లి, రంగసాయిపల్లి, రుద్రారం, వెలిచాల, వెదిర గ్రామాల్లోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని రేణికుంట శివాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఎల్ఎండీలోని ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ చల్లా మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శి మారం జగదీశ్వర్, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ శివకుమార్, ఎస్సైలు చేరాలు, ప్రమోద్ రెడ్డి, ఎంపీపీ కేతిరెడ్డి వనిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు.

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి సహస్ర లింగేశ్వరాలయం, కోట్లనర్సింహులపల్లి వీరభద్ర ఆలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.



వీణవంక మండలం నర్సింగాపూర్‌లో పూజలు చేస్తున్న వొడితెల ప్రణవ్



ఎల్‌ఎండీలోని శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు